సాక్షి
తిరుపతి
శుక్రవారం । 21 । జూలై । 2023



పాలు పొంగిస్తూ!
పాడి రైతుల అభ్యున్నతే లక్ష్యంగా..సమస్యల పరిష్కారమే ధ్యేయంగా శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ దూసుకుపోతోంది. - 8లో



జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి
సీఎం జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	27
చిత్తూరు	35	27
తిరుమల	31	23
గూడూరు	38	29
నగరి	37	28

మా 'నేస్తం'నువ్వే!

వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. వెంకటగిరిలో శుక్రవారం జరగనున్న రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్య మంత్రి హోదాలో మొదటిసారి వెంకటగిరికి వస్తున్న ప్రియతమ నేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. సభకు హాజరు కానున్న నేత కార్మికులకు సకల వసతులు కల్పించారు. వేలాది మంది కూర్చొని వీక్షించే విధంగా సభావేదికను అందంగా ముస్తాబు చేశారు.





సిద్ధమైన సభాప్రాంగణం

- నేడు వెంకటగిరిలో 'వైఎస్సార్ నేతన్న నేస్తం'
- బటన్ నొక్కి నగదు జమచేయనున్న సీఎం వైఎస్ జగన్

వెంకటగిరి: పట్టణంలోని ఎస్ఎల్ఆర్ కల్యాణ మండపం సమీపంలోని మైదానంలో వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించనున్నారు. నేతన్నలకు ఐదో విడత మొత్తాన్ని బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయనున్నారు. ఈ మేరకు అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. డెప్యూటీ సీఎం కే.నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలసిల రఘురామ్, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, నియోజకవర్గ పరిశీలకులు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, తిరుపతి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు నెమలిపూడి సురేష్‌రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వర్రావు, కలిమేలి రాంప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి, ఇతర నేతలు

నేతన్నలతో మమేకం కానున్న సీఎం జగనన్న

బహిరంగ సభాప్రాంగణం వద్ద సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేనేత కార్మికులతో ముచ్చటించనున్నారు. వారితో కలిసి ఫొటోషూట్ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

1,500 మంది పోలీసు బందోబస్తు

సీఎం పర్యటన నేపథ్యంలో 1,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మేరకు బందోబస్తులో పాల్గొనే సిబ్బంది, పోలీసు ఉన్నతాధికారులతో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సమావేశమయ్యారు. అంతకుముందు హెలీప్యాడ్ వద్ద డీఐజీ అమ్మిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, మునిరామయ్య, డీఎస్పీ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 74,024 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 32,688 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.96 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వైఎస్సార్ జీవిత సాఫల్య అవార్డులకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార్ అవార్డు, వైఎస్సార్ అఛీవ్‌మెంట్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈఓ డాక్టర్ వీ.మురళీకృష్ణ తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్య రంగం, సామాజిక సేవ, సైన్స్, ఇంజినీరింగ్, ప్రజా వ్యవహారాలు, పౌరసేవలు, వృత్తి, పరిశ్రమ వంటి రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. లాభార్జన ఉద్దేశం లేకుండా సమాజ సేవ చేసిన ఎన్‌జీఓ సంస్థలు కూడా అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు దారులు తాము చేసిన సేవలు గురించి ఒక పేజీలో క్లుప్తంగా వివరాలు తెలియజేసి మొబైల్ నంబర్, మెయిల్ ఐడీలకు తెలియజేయాలని సూచించారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను ఆగస్టు 8వ తేదీలోపు ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్విన్ కార్యాలయం, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా, అలిపిరి రోడ్డు, తిరుపతి చిరునామాకు పంపాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 0877–2286921ను సంప్రదించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధికూలీ మృతి


మృతిచెందిన రమేష్

నారాయణవనం: ఉపాధి పనుల కోసం వెళ్తున్న కూలీని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలోని రాజుల కండ్రిగ క్రాస్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. గురువారం ఉదయం నైనారుకండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన రమేష్(34) ఉపాధి పనులకు బయలుదేరాడు. జాతీయ రహదారిలో ఎడమ వైపు రోడ్డు దిగి నడిచిపోతుండగా.. పుత్తూరు వైపుగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్ర గాయాలైన రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. మృతుడికి భార్య, ఏడేళ్లలోపు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. నెల రోజుల వ్యవధిలో మండలంలోని జాతీయ రహదారిలో జరిగిన నాలుగు రోడ్డు ప్రమాదాలలో ఆరుగురు మృతి చెందడం గమనార్హం.

నేతన్న నేస్తం..నువ్వే సమస్తం!


విద్యుత్ మోటారుతో కూడిన స్టాండ్ మగ్గం ఏర్పాటు చేసుకున్న చేనేత కార్మికుడు పి.రవి

ఈ ఫొటోలోని చేనేతకార్మికుడు వెంకటగిరి పట్టణం, బంగారుపేటకు చెందిన పీ.రవి. ఈయన గతంలో గుంత మగ్గంలో నేత పనులు సాగించేవాడు. వర్షాకాలంలో గుంత మగ్గంలోకి నీరు రావడంతో రెండు నెలలు పాటు పనులు సాగేవి కావు. అయితే వైఎస్సార్ నేతన్ననేస్తం పథకం ద్వారా అందిన నగదుతో మరికొంత నిధులు వెచ్చించి విద్యుత్ మోటారుతో నడిచే స్టాండ్ మగ్గం ఏర్పాటు చేసుకున్నాడు. చేనేత పనులు సులభంగా, వేగంగా.. వర్షాకాలంలో కూడా ఇబ్బందులు లేకుండా.. చేసుకోగలుగుతున్నాడు.

.. ఇది ఒక్క రవి పరిస్థితే కాదు.. జిల్లాలోని చేనేత కార్మికులందరూ తమ కాళ్లపై తాము నిలబడగలుగుతున్నారు. అప్పుల ఊబి నుంచి బయటపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఏటా రూ.24 వేలు పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. తాజాగా శుక్రవారం వెంకటగిరిలో వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదో విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విడుదల చేయనున్న నేపథ్యంలో నేత కార్మికులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు కొండంత అండగా నిలిచిన జగనన్నను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని చెబుతున్నారు.

జిల్లాలో వైఎస్సార్ నేతన్ననేస్తం లబ్ధిదారుల వివరాలు

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	నిధులు (రూ.కోట్లలో)
2019–20	3,822	9.17
2020–21	3,672	8.81
2021–22	3,125	7.50
2022–23	3,171	7.61
2023–24	3,447	8.28


వెంకటగిరిలో అల్లు పడుతున్న చేనేతలు

మగ్గానికి పూర్వవైభవం

- నేతన్నలకు జగనన్న అండ
- ఏటా రూ.24 వేలు జమ
- నేడు ఐదో విడత వైఎస్సార్ నేతన్న నేస్తం నిధులు విడుదల
- వెంకటగిరిలో బటన్ నొక్కి కార్యక్రమాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి


స్టాండ్ మగ్గంతో పనులు చేసుకుంటున్న చేనేత కార్మికురాలు కే.మాధవి


చేనేత పనులు చేసుకుంటున్న చేనేత కార్మికుడు సోమశేఖర్

తిరుపతి జిల్లా సమాచారం

నేత కార్మికులు	15,475
సొంత మగ్గాలు ఉన్న వారు	4,250
చేనేత సొసైటీలు	42
చేనేత వృద్ధాప్య పింఛన్‌దారులు	5,771 మంది

వెంకటగిరి: చేనేత రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తోంది. పవర్‌లూమ్‌తో కుదేలైన రంగాన్ని గాడిలో పెట్టింది. గత పాలకుల నిర్లక్ష్యంతో కనుమరుగవుతున్న మగ్గానికి పూర్వవైభవం తీసుకొచ్చింది. మునుపెన్నడూ లేనివిధంగా నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తోంది. నేత కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఆపన్నహస్తం అందిస్తోంది. ముద్రయోజన, క్లస్టర్ల ఏర్పాటుతో మరింత ఆర్థిక చేయూతనందిస్తోంది.

మాటంటే మాటే!

ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి నియోజకవర్గం, సైదాపురానికి పాదయాత్రగా చేరుకోగా.. నెల్లూరు జిల్లా నుంచి పెద్ద ఎత్తున కార్మికులు విచ్చేసి సమస్యలను ఏకరువు పెట్టారు. నేతన్నల సమస్యలు విన్న ఆయన నేత కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నెలకు రూ.2వేల చొప్పున ఏడాదికి రూ.24 వేలు అందజేస్తామని మాటిచ్చారు. ఇచ్చిన మాటప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీల అమలుకు ప్రాధాన్యమిచ్చారు. ఇప్పటికే నాలుగు విడతలుగా వైఎస్సార్ నేతన్న నేస్తం నిధులు విడుదల చేశారు. కరోనా లాక్‌డౌన్ సమయంలోనూ ఆపద్బాంధవుడిలా ఆదుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సాయంతో ముడిసరుకులు కొనుగోలు చేసుకోవడమే కాకుండా మగ్గాన్ని ఆధునిక పద్ధతులతో తయారు చేసుకోవడం, సొంతంగా వ్యాపారాలు చేసుకోవడం, ఆధునిక డిజైన్లతో చీరలు నేయడం వంటి పనులు చేసుకుంటున్నట్టు పలువురు నేతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గుంత మగ్గాల స్థానంలో స్టాండ్ మగ్గాలు

ఆర్థిక స్థోమత లేక పాత పద్ధతులైన గుంత మగ్గాల్లోనే నేత కార్మికులు మగ్గేవారు. వర్షాలప్పుడు సుమారు రెండుమూడు నెలలపాటు మగ్గం గుంతల్లోకి నీరు చేరడంతో పనుల్లేక పస్తులతో కాలం నెట్టుకొచ్చేవారు. మగ్గం మీద ఉన్న పడుగు, జరీ బూజుపట్టి పాడైపోయేవి. ఇప్పుడు ఇలాంటి సమస్యలకు చెక్‌పెట్టారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం నిధులతో గుంత మగ్గాల స్థానంలో స్టాండ్ మగ్గాలు ఏర్పాటు చేసుకున్నారు. వర్షాకాలంలోనూ ఎలాంటి ఇబ్బందుల్లేకుండా నేతపనులు సాగిస్తున్నారు. మరికొంత మంది సొంతంగా ముడిసరుకు కొనుగోలు చేసుకొని చీరలు తయారు చేసి వ్యాపారాలు చేస్తూ.. ఆర్థికంగా స్థిరపడుతున్నారు.

ముద్ర యోజన.. క్లస్టర్ అభివృద్ధితో ప్రయోజనం

చేనేత కార్మికులకు ప్రభుత్వం రూ.2,5000 సబ్సిడీ కలిగిన రుణాలను మంజూరు చేస్తోంది. 2022–23లో జిల్లాలో 255 మంది నేత కార్మికులకు రూ.1.78 కోట్లు మంజూరు చేయగా.. 2023–24లో ఇప్పటివరకు 29 మంది కార్మికులకు రూ.29 లక్షలు మంజూరు చేసింది. ఇక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చేనేత క్లస్టర్లను ఏర్పాటు చేసి ఆధునిక నేత పరికరాలను 90 శాతం సబ్సిడీపై అందిస్తోంది. ఈ పథకం ద్వారా వెంకటగిరిలోని భావనారుషి చేనేత క్లస్టర్‌లో 395 మంది చేనేత లబ్ధిదారులకు రూ.1.63 కోట్లు మంజూరు చేసింది. తొలి విడతగా రూ.41.25 లక్షలతో చేనేత పరికరాలను గత నెలలోనే పంపిణీ చేసింది.

చేనేత కుటుంబాలకు అండ

నేత పనులపై ఆధారపడి జీవిస్తున్నాం. సొంతిల్లు లేదు. ఇంట్లో మగ్గం గుంత తవ్వుకోవాల్సి ఉండడంతో అద్దెకు ఇల్లు లభించేది కాదు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆయన ఇస్తున్న నేతన్న నేస్తం నిధులతో స్టాండ్ మగ్గం సమకూర్చుకున్నాం. అద్దె ఇంటి కష్టాలు కూడా తప్పాయి. మగ్గాలను ఆధునీకరించి నేత పనులు సులభంగా చేస్తున్నాం.

– కే.మాధవి, బంగారుపేట, వెంకటగిరి

బాబు హయాంలో ఆదరణ కరువు

టీడీపీ హయాంలో చేనేత పరిశ్రమను ఎవ్వరూ పట్టించుకోలేదు. ముడి సరుకుల ధరలు పెరిగినా ప్రభుత్వ ప్రోత్సాహం ఉండేది కాదు. నేత కార్మికులకు అందించే చేనేత పింఛన్ కూడా టీడీపీ నాయకుల దయాదాక్షిణ్యాల మీదే ఆధారపడి ఉండేది. అర్హత ఉన్నా టీడీపీ నాయకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి ఏటా మగ్గం ఉన్న చేనేత కార్మికుడి వ్యక్తిగత ఖాతాలో రూ.24,000 జమవ్వుతోంది. నేత పనులు చేసుకునేందుకు ఆర్థిక అండ లభించింది.

– ఎస్.సోమశేఖర్, చేనేత కార్మికుడు, వెంకటగిరి

చేనేతల సంక్షేమానికి కృషి



చేనేతపరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. అర్హత కలిగిన ప్రతి చేనేత కుటుంబానికీ వైఎస్సార్ నేతన్ననేస్తం పథకం కింద ఏటా రూ.24,000 అందజేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చేనేత కార్మికులకు ముద్రయోజన రుణాలు, క్లస్టర్ల ఏర్పాటు చేస్తోంది. తద్వారా వర్క్‌షెడ్‌లు, సబ్సిడీపై చేనేత పరికరాలు అందించేందుకు వీలుకలుగుతోంది.

– కే.వెంకటరామ్, చేనేత, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, తిరుపతి జిల్లా

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


పూలపై నడిపిస్తున్న మహిళలు

- గడప గడపలో మోహిత్‌రెడ్డికి అపూర్వ స్వాగతం

పాకాల: సీఎం జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని చెన్నుగారిపల్లి పంచాయతీ పరిధిలో చెన్నుగారిపల్లి, చెన్నుగారిపల్లి దళితవాడ, బీసీ కాలనీ, యల్లమనాయనపల్లి, లక్ష్మీనగర్, బార్లీకొండ బంగ్లా గ్రామాల్లో గడపగడపకు మహా పాదయాత్ర నిర్వహించారు. తమ గ్రామానికి విచ్చేసిన మోహిత్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గజమాలలు వేసి ఘనంగా స్వాగతించారు. మహిళలు మంగళ హారతులు పట్టి, గుమ్మడి కాయలతో దిష్టి తీసి అపూర్వ స్వాగతం పలికారు. భారీగా బాణసంచా కాల్చి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ప్రతి గడకూ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ని అందజేశారు. అర్హతే ప్రామాణికంగా, కులాలకు, మతాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నట్లు వివరించారు. గ్రామాల్లో ఎక్కడ ఏ సమస్య ఉన్నా తనకు తెలపాలని సూచించారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

పంచాయతీలో మెరుగైన అభివృద్ధి

పంచాయతీలోని అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు, సైడు కాలువలు, సచివాలయ నిర్మాణం, ఆర్బీకే, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్, జగనన్న సమావేశ మందిరం, రచ్చబండ వంటి పనులకు రూ.2.1 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గం ప్రజలపై ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎనలేని ప్రేమానుబంధాలు కలిగి ఉన్నారని, ప్రజలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా ముందుంటారని గుర్తుచేశారు. తండ్రి బాటలోనే నడుస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, సర్పంచ్ కళావతి, మాజీ జెడ్పీటీసీ పవన్‌కుమార్, మహాసముద్రం పట్టాభిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు కపిలేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్, రమేష్, చంటి, మోహన్, శివప్రసాద్ పాల్గొన్నారు.

వాగ్యుద్ధం

- ఇంటింటికీ బొజ్జల కార్యక్రమంలో బయటపడ్డ టీడీపీ నేతల వర్గ విబేధాలు


మామండూరులో వాగ్వాదానికి దిగిన తెలుగు తమ్ముళ్లు

రేణిగుంట: రేణిగుంట మండల టీడీపీ నాయకుల మధ్య ఉన్న వర్గవిబేధాలు మరోసారి రచ్చకెక్కాయి. మండలంలోని మామండూరులో గురువారం 'ఇంటింటికీ బొజ్జల' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆయన తల్లి బొజ్జల బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. అయితే బొజ్జల సుధీర్‌రెడ్డి కరకంబాడి జాతర నిమిత్తం మధ్యలోనే దిగిపోయారు. ఆయన వెంట కొంతమంది నాయకులు వెళ్లగా.. బొజ్జల బృందమ్మ, ఆమె కోడలు రిషితారెడ్డి ప్రచారాన్ని కొనసాగించారు. అక్కడకు వెళ్లిన నాయకులు కొందరు మళ్లీ తీరిగ్గా భోజనాలు చేసే సమయానికి మామండూరుకు చేరుకున్నారు. దీంతో మీరంతా వెళ్లిపోతే ఇక్కడ కార్యక్రమంలో ఎవ్వరూ లేకుండా ఎలా.. అంటూ టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు చిన్నారెడ్డి నేతలపై గట్టిగా అరిచాడు. దీంతో చిన్నారెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, మునస్వామినాయుడు బొజ్జల బృందమ్మ సమక్షంలో గట్టిగా వాదులాడుకుంటూ ఒకరినొకరు నెట్టుకున్నారు. అయితే అక్కడున్న మిగిలిన నాయకులు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

కన్నీళ్లు తుడుస్తూ..పాలు పొంగిస్తూ!

అభివృద్ధి పథంలో ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ

- వర్సిటీకే తలమానికంగా ఐవీఎఫ్ ల్యాబ్
- పాడి రైతులకు అండగా కార్యక్రమాలు
- 12వ స్నాతకోత్సవానికి సిద్ధమైన వర్సిటీ



ఐవీఎఫ్ ల్యాబ్

తిరుపతి ఎడ్యుకేషన్ : పాడి రైతుల అభ్యున్నతే లక్ష్యంగా శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ దూసుకుపోతోంది. కష్టకాలంలో పాడి రైతులకు అండగా నిలుస్తోంది. రైతులకు సూచనలు, సలహాలు అందిస్తూ అధిక పాలదిగుబడికి దోహదపడుతోంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి 21–06–2005లో జీఓను విడుదల చేయగా.. 15–07–2005 నుంచి వర్సిటీ ప్రారంభమైంది. 1–04–2006 నుంచి వర్సిటీ కార్యకలాపాలను ప్రారంభించి విద్యార్థులకు బోధన, పాడి రైతులకు అవగాహన కల్పిస్తూ దినదినాభివృద్ధి చెందుతోంది.

పాడి రైతులకు అండగా నిలుస్తూ ..

2005లో స్థాపించిన వర్సిటీ దినదినాభివృద్ధి చెందుతూ పశువైద్య విద్యార్థులు, పరిశోధకులు, పాడి రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేస్తోంది. వర్సిటీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 10 పశువైద్య శిబిరాలు, 5 కిసాన్ మేళాలు, ఒక డెయిరీ మేళా నిర్వహించడంతో పాటు పాడి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, మెలకువలు అందించేందుకు ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్‌లో వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోంది. అలాగే రైతులకు ఉపయోగపడేలా 145 శిక్షణా కార్యక్రమాలు, వివిధ వ్యాధులపై అవగాహనా కార్యక్రమాలు, పశువైద్యానికి సంబంధించి 6 కార్యక్రమాలను నిర్వహించింది. కాలనికి అనుగుణంగా రూ.8 కోట్లతో ఈ–కాన్ఫరెన్స్, ఆధునిక రికార్డింగ్ వంటి వసతులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది.

ప్రతిభకు ప్రోత్సాహం

వర్సిటీ స్థాపించినప్పటి నుంచి 11 స్నాతకోత్సవాలను నిర్వహించి వివిధ విభాగాల్లో 5,164 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేసింది. శనివారం నిర్వహించనున్న 12వ స్నాతకోత్సవంలో 361మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుంది. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ కింద 41 సంస్థలు పనిచేస్తున్నాయి. 01–04–2022 నుంచి 31–03–2027 వరకు ఐదేళ్లకు అక్రెడిటేషన్‌ను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ నుంచి వర్సిటీ పొందింది. అలాగే 18 విభాగాల్లో పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు ఐసీఏఆర్ అనుమతి పొందింది. ఈ ఏడాది నాక్ గుర్తింపునకు వర్సిటీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. కొత్తగా ఈ ఏడాది పులివెందులలో పశువైద్య కళాశాల, సంతగుడిపాడులో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించింది.

మెరుగైన స్థానం

ఈ ఏడాది అగ్రికల్చరల్ విశ్వవిద్యాలయాలకు ఎన్ఐఆర్ఎఫ్ ఇచ్చిన ర్యాంకుల జాబితాలో ఎస్వీ వెటర్నరీ వర్సిటీ 31వ ర్యాంకుతో మెరుగైన స్థానం పొందింది. అలాగే పశువైద్య విశ్వవిద్యాలయాల్లో నాల్గవ స్థానంలో వర్సిటీ నిలిచింది.

ఐవీఎఫ్ ల్యాబ్

టీటీడీతో కలిసి ఆధునిక వసతులతో ఇన్‌విట్రో ఫర్టిలైజేషన్(ఐవీఎఫ్) ల్యాబ్‌ను ఏర్పాటుచేసింది. ఐవీఎఫ్ పద్ధతి ద్వారా మొదటి సాహివాల్ జాతి మొదటి దూడ 24–06–2023, రెండో దూడ 27–06–2023న జన్మించాయి. వీటికి పద్మావతి, వైష్ణవి అనే పేర్లు నామకరణ చేశారు. ఐవీఎఫ్ పద్ధతి ద్వారా రానున్న ఐదేళ్లల్లో సాహివాల్, ఒంగోలు, గిర్ వంటి గోజాతుల నుంచి 300 దూడలకు జన్మనివ్వడమే లక్ష్యంగా పని చేస్తోంది. అలాగే పశువులకు, రైతులకు నాణ్యమైన దానా అందించడానికి టీటీడీ సహకారంతో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసింది.

రేపు ఎస్వీ వెటర్నరీ వర్సిటీ స్నాతకోత్సవం

తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం 12వ స్నాతకోత్సవాన్ని శనివారం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు వర్సిటీ వీసీ డాక్టర్ వీ.పద్మనాభరెడ్డి తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్వీ వెటర్నరీ వర్సిటీని 15–07–2005న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రారంభించారని, తిరుపతి కేంద్రంగా 01–04–2006 నుంచి వర్సిటీ తన కార్యకలాపాలు, సేవలను ప్రారంభించిందని తెలిపారు. ఇప్పటి వరకు వర్సిటీ 11 స్నాతకోత్సవాలు నిర్వహించి వివిధ శాఖల్లో 5,164 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేసినట్లు వివరించారు. శనివారం నిర్వహించనున్న 12వ స్నాతకోత్సవానికి చాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా కేరళ వెటర్నరీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎంఆర్.శశీంద్రనాథ్ హాజరవుతారన్నారు. 12వ స్నాతకోత్సవంలో బ్యాచులర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్‌లో 222 మందికి, బీ.టెక్ (డెయిరీ టెక్నాలజీ)లో 37, పీజీలో 102, పీహెచ్‌డీలో ఐదుగురు, మొత్తం 361 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. వివిధ విభాగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 35 బంగారు, 2 వెండి, 1 నగదు బహుమతిని అందజేస్తామన్నారు. ఇందులో అత్యధికంగా ఓ విద్యార్థిని 7, మరో విద్యార్థిని 5 బంగారు పతకాలు అందుకోనున్నట్లు తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అరుణాచలం రవి, డీఆర్ డాక్టర్ సర్జన్‌రావు, వెటర్నరీ, డెయిరీ డీన్‌లు డాక్టర్ కే.వీరబ్రహ్మయ్య, డాక్టర్ జె.సురేష్, డీఈ డాక్టర్ వెంకటనాయుడు, సీఈఓ చెంగల్వరాయులు, ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాంబాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న వీసీ పద్మనాభరెడ్డి

ఎస్వీయూలో చిన్న ఉపగ్రహ ప్రయోగంపై సదస్సు


సదస్సును ప్రారంభిస్తున్న ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ రాజారెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీ యూనివర్సిటీలో గురువారం 'ఆపర్చునిటీస్ ఫర్ ది డెవలప్‌మెంట్ అండ్ లాంచ్ ఆఫ్ స్మాల్ శాటిలైట్స్' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సును వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కే.రాజారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రీసెర్చ్–డెవలప్‌మెంట్ విభాగం సమర్థవంతంగా ఉందని, వ్యర్థాల రీసైక్లింగ్ ఇంకుబేషన్ కేంద్రాలు నూతన ఆవిష్కరణకు, ఉపాధికి ఉపకరిస్తున్నట్లు తెలిపారు. చిన్నతరహా ఉపగ్రహాల ప్రయోగం, ప్రయోజనాలపై బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ పద్మభూషణ్ డాక్టర్ ఏ.శివతను పిళ్లై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయభాస్కరరావు, ఎస్‌వీ.సత్యనారాయణ, కౌశిక్, వంశీకృష్ణ పాల్గొన్నారు.